# చిరంజీవి

చిరంజీవి సిక్ బే(హాస్పిటల్)లో మూలుగుతున్నాడు. డాక్టరేమంటాడోనని గుండెలు దడదడ కొట్టుకుంటున్నవి. వరండాలో కుర్చీలో కూలబడ్డా న్నేను. ఆ పూటతో రేషన్ పూర్తయ్యింది. మిలిటరీ కాపలా బయటి గాలిని లోపలికి రానీయటంలేదు. నీళ్ల నిలవ తొట్టెగూడా ఖాళీ అయిపోయింది. నీళ్లూ, తిండీ లేకుండా మేం యెక్కువకాలం నిలవ లేమనీ, మాలో పలచటి వెన్నెముకవాళ్ళు నీళ్ళు కారిపోతారనీ, మా నైతికబలం బ్రద్దలౌతుందనీ పై అధికారుల అంచనా.

లోపల సింగూ, చక్రవర్తీ గన్నర్స్ మేట్తో మాట్లాడుతున్నారు. ఎస్టాబ్లిష్మెంటంతా అట్టుడికినట్లుడికిపోతోంది.

కాప్టెన్ మైక్ లో మాట్లాడుతున్నాడు. "మీ బాగోగులు మీరే నిర్ణయించుకోండి. ఇంటి దగ్గరున్న తల్లిదండ్రుల్ని తలపుకు తెచ్చుకోండి. కాంపును మిలిటరీవాళ్ళ చేతుల్లో పెట్టాను. హద్దుమీరినవాళ్ళు గుండుదెబ్బ తింటారు. జాగ్రత్త! వళ్లు దగ్గరుంచుకోండి!!"

ఎస్బియే (కాంపౌండరు) బయటికి వచ్చాడు. "ప్లానింగ్ ఆఫీసరు మన నేవీనే సముద్రంలో కలుపుతానన్నాడు. అయినా భయపడలేదు మనం. గుండుదెబ్బలట!" అంటున్నాడు నవ్వుతూ. "చిరంజీవెలా వున్నాడు?" అన్నా న్నేను.

"గుండు తలవెనుక తగిలింది. గాయం కడిగాం. డాక్టర్ని పిలిచేందుకు వెళుతున్నా" అన్నాడు.

చిరంజీవి బ్రతుకుతాడా? రాయిలాంటి మనిషి రంగూన్‌నుంచి పారిపోయి వచ్చేప్పుడు ఎన్నికష్టాలు పడ్డాడు! మండిపోతున్న ఇల్లూ, చచ్చిపోయిన చెల్లెల్నీ వదిలి పరుగెత్తాడు, జపాను విమానాల్తో పందెంవేసి పరుగెత్తాడు. బర్మా దొంగల్ని కావడి బద్దల్తో మోదాడు. ఎనభై మైళ్ళు కాళ్ళు మడవకుండా నడిచాడు. ఇదంతా చెబుతూంటే అతని కళ్లు మెరిసేవి. "ఏముంది రావ్రూ! బ్రతుకుతాననే ఆశ గూడా లేదు. దీనికితోడు ఒక ముసలమ్మా, ఒక పసిపిల్లా, వాళ్ళదీ తెలుగు దేశమే. నాలాగునే వలసపోయారు, నడిచి నడిచి నడవలేకపోయారు. సరే! ఇద్దరినీ చెరోవైపునా కావడిలో కూర్చోబెట్టాను. మంచినీళ్లు కావాలంటే కొండలు దిగి రెండు మూడు ఫర్లాంగులు నడవవలసి వచ్చేది. వెనుతిరిగిచూస్తే దారి కన్పించేది కాదు. అంతా అడవులమయం. ముసలమ్మ బొడ్డుని కట్టుకున్న డబ్బు కాపాడమనేది! అలాగే ప్రయాణం చేశాం. ఎన్ని శవాలు చూశాం. నడవలేక చచ్చినవాళ్లూ, నాలుకెండిపోయినవాళ్లూ, నోటి ముందు దోసిటబట్టి కర్రలా బిగుసుకుపోయినవాళ్లూ, ఎన్నిరోజులు... ఎన్నిరోజులు! నెహ్రూ పంపిన శనగపప్పు అందేవరకూ దారకం లేదు. బ్రతికామనుకున్నాను. బ్రతికి లాభ మేమిటి? చచ్చినవాళ్ళ పగసాధించాలనీ — జపానువాళ్ళంటే గుండె మండిపొయ్యేది. నేవీలో చేరాను. రిక్రూటింగ్ ఆఫీసరు "నేవీలో ఎందుకు చేరుతున్నావ్?" అని అడిగితే నాకు నవ్వొ

చ్చింది. 'చాలా దేశాలు ప్రదేశాలు చూడ్డానికి, త్రాగుడు త్రాగటానికీ కాదు నేను చేరింది. జపానువాళ్ళని చావగొట్టడానికి' అన్నాను.

ఎప్పుడూ అంతే! గడుగ్గాయిలా సమాధానం చెప్పేవాడు. వంకర టింకర మాటలూ, డొంకతిరుగుడు సమాధానాలూ తెలియవు చిరంజీవికి.

అందుకనే అతన్ని 'టోపస్' బ్రాంచీలో పడేశాడు రిక్రూటింగు ఆఫీసరు. అప్పటికి నాకే తెలియదు. 'టోపస్' అంటే ఏమిటో! ఎవరో చెప్పారు 'పాకీపని' అని. చిరంజీవికా సంగతి తెలిసిం తర్వాత ఆఫీసరు దగ్గరకు పరుగెత్తాడు. "పాకీపని చెయ్యటానికి మెట్రిక్యులేషను పరీక్ష దేనికి? నేను పాకీపని చెయ్యటానికి చేరలేదు. జపానువాళ్ళని చంపటానికి చేరా" అన్నాడు. ఆఫీసరు పళ్ళికిలించాడు. 'ఇలాంటి ఆఫీసర్లుంటే ఇండియన్ నేవీ బంగాళాఖాతంలో కలుస్తుంది!' అన్నాడట చిరంజీవి. ఆఫీసరుకు కోపం వచ్చి "నీకు మెదడు లేదు. ముందు ప్రోసరుచానెలుగుండా రా! పో!" అన్నాట్ట. చిరంజీవికి అరికాలిమంట నెత్తికెక్కింది. "నాకు మెదడు లేకనే చేరానేమో కాని మీకు బుర్ర లేదు!" అన్నాట్ట. అని వెనక్కి తిరిగాడో లేదో, సుపీరియర్ ఆఫీసరును అవమానించినందుకు నాలుగు మాసాల ఖైదు!

తర్వాత అంటూండేవాడు: నేను అప్లికేషను వ్రాసి ఆరు మాసాలైంది. ఇంతవరకూ అతీపతీ లేదు. ఇంతవరకూ వాళ్ళకు లేనిది బుర్ర ఒక్కటే అనుకున్నాను. కళ్ళూ, చెవులూ, కాళ్ళూ యేమీ లేవు" అని.

శిక్షలంటే బెదిరేవాడు కాదు. అన్యాయమూ, అసందర్భమూ అనుకుంటే తల తన్నినట్లు మాట్లాడేవాడు. అందుకనే అతను 'టోపస్' అయినా అందరికీ అతనంటే ఆదరం. అంత అభిమానమూ, అంత అణకువానూ. "మన సత్తెటూళ్లలో రాళ్లు ఏరుకొని అన్నం తింటారు. నేవీలో మెతుకులు ఏరుకుని తినాలిసొస్తోంది" అని ఒక డెప్యూటేషను తీసికెళ్ళాడు కమాండింగు ఆఫీసరువద్దకి. "ఆ మాత్రం దొరుకుతూన్నందుకు సంతోషించండి...గాడిదలకాగింది చాలు!" అని కసురుకున్నాడు, మా బాగోగుల భాగ్యవిధాత! "సరే! ఐతే ఆ తిండి తినం!" అన్నాడు చిరంజీవి. చిరంజీవి వెనకున్న వెయ్యి గొంతుకలూ అరిచాయి. "ఆ తిండి తినం!" అని. మర్నాడు చిరంజీవికి బదిలీ! "మన గోడు వింటానికి ఆరు మాసాలు! మన గాడీ నడపడానికి ఆరు నిముషాలు" అన్నాడు చిరంజీవి బదిలీకి ప్రయాణంగడుతూ! అతనన్న మాటలు లోకోక్తులు మా నేవీకి.

"తిండి తినమంటే తినాల్సిందే!" అన్నాడు మా వెల్ఫేర ఆఫీసరు. "పురుగులు పడ్డవి!" అన్నాం మేము. "ఐనా సరే! అది మా ఆర్డరు! ఆర్డరును ఉల్లంఘించితే తెలుసుగా" అన్నాడు. "ఆర్డరిచ్చేడోకుల్నాపండి" అన్నాడు చిరంజీవి. "అది నేవీకి ఉబుసుపోక ఐపోయింది." అన్నాడు ఆఫీసరు.

చిరంజీవి చేసిన పనులన్నన్ని కావు! మిట్టమధ్యాహ్నం పన్నెండు గంటలప్పుడు మండు టెండలో మాకు ఫిజికల్ ట్రయినింగు. ఇది ఫిజికల్ ట్రయినింగూ కాదు మట్టీ కాదు. ప్రపంచంలో బలం సంపాయించడానికి కసరత్తు

చేస్తారు. మనం కసరత్తు చెయ్యటానికి బలం సంపా యించాల్సి వస్తోంది" అని విసుక్కునేవాడు చిరంజీవి. ఆటల పోటీల్లో మొట్టమొదటి బహుమానం కొట్టుకొచ్చే వాడు. కాన్వాస్ షూస్ లేకుండా పీటీ చెయ్యమన్నాడు ఇన స్ట్రక్టరు. "ఎవరు నేర్పారు నీకు?" అన్నాడు చిరంజీవి. "పెరేడ్ గ్రౌండ్ మాసిపోతుం"దన్నాడు. అతను చిరంజీవి కళ్ళల్లో కదుల్లాడే చిలిపినవ్వు చూచి ఇనస్ట్రక్టరు తప్పు దిద్దు కున్నాడు. "చిరంజీవీ! ఇదంతా ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు ఆర్డరు. నేనేం చెయ్యను? ఏం చెయ్యగలను? అని ఉసూరుమన్నాడు. మర్నాడు చిరంజీవి అతనితో గంటలకొద్దీ మాట్లాడాడు. "ఏమిటోయ్ సంగతి?" అంటే "ఇనుంలాంటి ఒళ్లు పెట్టుకొని మెదడుకు తుప్పు పట్టించుకోబాక!" అని చెప్పానన్నాడు. ఆ ఇనస్ట్రక్టరే మొన్న మా ప్రొసెషనుకు ముందు నడిచాడు.

ఎంతమందిలో మార్పు తెచ్చాడు యీ చిరంజీవి! ఆఫీ సర్ల కతనంటే గుండెలు కొట్టుకునేవి. రేటింగుల కతనంటే ప్రాణాలు లేచివచ్చేవి. రెగ్యులేటింగు స్టాఫంతా అతన్ని గురు వుగా కొలిచేవారు. "మీకు డిసిప్లినంటే యేం తెలుసు? మీరు చేసేదంతా రెడ్ టేపిజం" అని వెక్కిరించేవాడు వాళ్ళని. "మీకు రికార్డులు చూసి కేసులు పెట్టటం, అభమూ శుభమూ తెలియనివాళ్ళ గొంతులు కొయ్యటం తప్పితే ఇంకేం తెలుసు" అని ముఖంయెదుట కడిగి వదిలిపెట్టేవాడు. వాళ్లు చాటు మాటుగా వచ్చి "చిరంజీవి! నీకు తెలియదు. నువ్వు మా పోస్టులో వుంటే మేం చేసినట్లుగానే చేస్తావు" అనేవారు. ఈ మూడు రోజుల్లో స్ట్రయిక్ ప్రారంభం అయినంతర్వాత మమ్మ

ల్నందర్నీ ఎంత క్రమశిక్షణతో నడిపాడు! అంతకు పూర్వం ఆఫీసర్లు ఫోర్సుతో చేయించలేని పనిని, వాలంటీర్లు తయారై చేశారు. ఎంత శాంతంగా, ఎంత ఆర్డర్లీగా నడచింది మా క్యాంపంతా? అదిచూచిన రెగ్యులేటింగు సేటీ ఆఫీసరు అబ్దుల్ రహమాన్ "ఎక్కడ నేర్చుకున్నావయ్యా చిరంజీవి?" అని ఆశ్చర్యపడ్డాడు. "రష్యాలో ఎర్రసైన్యమూ, చైనాలో ప్రజా సైన్యమూ, యుగోస్లేవియాలో గెరిల్లాలు..."అంటూ అతనికి ఊపిరాడకుండా ఉపన్యాసం ఇచ్చాడు చిరంజీవి. అబ్దుల్ రహమాన్ అదరిపోయాడు. మర్నాడు కాంగ్రెసు, లీగు, కమ్యూనిస్టుజండాలు పుచ్చుకొని హాజరయ్యాడు.

చిరంజీవి మాట్లాడుతూంటే కంచుగంట మ్రోగుతున్నట్టుండేది...

"రావుగారూ! డాక్టరుగారు వచ్చారు. ఆపరేషను రూంలోకి వెళ్తున్నాం" అన్నాడు. ఎస్. బి యే. ఉలిక్కిపడ్డాను. డాక్టరుగారిని చూచి విష్ చేశాను. "అంత కంగారు పడకండి...చిరంజీవి బ్రతుకుతాడు లే" అని డాక్టరుగారు తల వంచుకుని ముందుకు పోతున్నాడు.

హాల్ కార్టు (చక్రాల మంచం)మీద పడుకోబెట్టి తీసికెళ్తున్నారు చిరంజీవిని. అరగంట క్రితంవరకూ క్యాంపంతా తానై తిరిగాడు. ఇప్పుడు!.....ఉక్కులాంటి శరీరం దుప్పట్ల మడతల్లో కలిసిపోతోంది. చిరంజీవి దగ్గుతున్నాడు. కంచులాంటి గొంతుక ఎంత బలహీనమై పోయ్యింది. అతను ఉపన్యాసమిస్తూంటే......మొన్నను — నిన్నగాక మొన్న

వెయ్యిమంది గుండెల్లో అగ్ని రగుల్కొల్పాడు. "శతాబ్దం నుంచీ బాధలు పడ్డాం. తాపులు తిన్నాం. అటు సామ్రాజ్య వాదుల తాపులూ ఇటు మన సోదర దేశీయుల అసహ్యమూ అనుభవించాం. మనం పొట్ట కక్కుర్తికోసం చేరిన మెర్సినరీ దళంవాళ్ళం కాదు! ఇతర దేశాల్లో ప్రజలు నవ్య ప్రపంచం కోసం, ప్రజా ప్రభుత్వంకోసం చేసే కృషిని కళ్లారా చూశాం విదేశాలకి వెళ్ళినప్పుడు...50 సంవత్సరాలుగా మన దేశంలో పెంపొందుతూన్న నవ్య రాజకీయ చైతన్యాన్ని చూస్తున్నాం మన శక్తి సామర్థ్యాలు మన మెరుగుదుం. తెల్లవాళ్ళకీ మనకీ వున్న తేడా మనకు తెలుసును" అంటూ దైనందిన జీవితం లోని కష్టాల్ని పేర్కొంటూ అతను ఉపన్యాసమిస్తూంటే మా క్యాంపులోవాళ్ళం వెయ్యిమందిమీ ఉప్పొంగిపొయ్యాం. అంతవరకూ మమ్మల్ని లోకువ చేసికొన్న దుర్భరజీవితం చూచి చూచి ఒక్క తాపు తన్నింది.

మా యినుప గజ్జెలతల్లి సామ్రాజ్యవాదం చూపే బాయొనెట్లకూ, గురిపెట్టే 22 తుపాకులకూ, నడిపే టాంకు లకూ, పేల్చే మర ఫిరంగులకూ యెదురొడ్డి నిలబడేట్లు చేసింది చిరంజీవి కంచు మ్రోత.

చిరంజీవితో మాట్లాడిన మనిషి అతనిమాట కెదురు చెప్పలేడు. ఎవరిచ్చారో అతనికా వశీకరణశక్తి. మొదటి నాడు ముట్టడించిన మరాఠీ సైనికులతోనూ, పంజాబు సిక్కు సైనికులతోనూ, అరగంటసేపు మాట్లాడాడు. మేం చూస్తూండ గానే "మా సోదరుల్ని గాల్చేందుకా మేం తుపాకులు పట్టింది" అని నేలకేసి కొట్టారు. "ఛూంబాడా! నిద్రపోతున్నా,

(4)

సింహం మేల్కొన్నది" అన్నాడు చిరంజీవి నిబ్బరంగా. మర్నాటికి తెల్లగుంపు దిగింది చీమలబారులా...

డాక్టరు తెల్లముసుగులో తిరుగుతున్నాడు. ఎస్.బి. యే. బయటికి వచ్చాడు. "ఎట్లా వున్నది" అన్నాను. ఆతురతగా "ఆపరేషను చేస్తున్నారు" అంటున్నాడు. ఎవరికీ ఆపరేషను! చిరంజీవికా? చిరంజీవికి! హారతులు పట్టడం లేదూ చిరంజీవికి! చిరంజీవి మెడలో పూలమాలలు వెయ్యటం లేదూ? డాక్టరు కత్తిపుచ్చుకుంటున్నాడా? కామాటీలు పూలమాలలు వేశారు మా చిరంజీవికి! 'మేం మీ బిడ్డలం, మమ్మల్ని వాళ్ళు 'గాడిద కొడుకులు' అనీ 'లంజకొడుకులు' అనీ తిడుతున్నారు. ఇంక మేం పడం. ఇంక మేం సహించలేం. ఆయుధాలు పట్టాం మీ అండను ఆశిస్తున్నాం—"అంటూ ఆశుధారగా ఉపన్యాస మిస్తూంటే కామాటీలు కళ్ళనీళ్లు పెట్టుకున్నారు. వాళ్ళకళ్లల్లో కోపం మెర్రజీరలు కట్టుకొని గంతులేసింది...చిరంజీవితో పాటు వాళ్లూ మండిపోయ్యారు. కాంగ్రెసుకి జయ్! లీగుకూ జయ్! "కమ్యూనిస్టుపార్టీకి జయ్!" "జాతీయ 'నేవీ' జిందా బాద్!" అంటూ కామాటీపురం ప్రతిధ్వనించింది. ఆ ప్రతి ధ్వనిలో టాంకుల మోత వినబడలేదు మాకు. గుండ్లు బుఁయ్ మంటూ గాలిలో దూసుకుపోవటం చూచాం. చిరంజీవి వాళ్ళవైపుకు చూపుతూ యేమిటో చెబుతున్నాడు. ఒక గుండు అతన్ని దూసుకుపోయింది. ఇది చూచిన కామాటీ... తలంతా నెరిసిన ముసలి కామాటీ.....చిరంజీవి వళ్లంతా తానై కప్పాడు. చిరంజీవి తల బైటికి పెట్టి మాట్లాడు తున్నాడు. మరో గుండు తగిలింది అతని తలకు. చిరంజీవి పడి

పోయ్యాడు. కామాటీల సముద్రం కల్లోలమయ్యింది. టాంకులు చెదిరిపోయ్యాయి.

చిరంజీవిని తీసికొస్తుంటే యెంత గల్లంతు చేశారు కామాటీలు. ఎంత నచ్చజెప్పవలసి వచ్చింది. అతని ప్రాణం రక్షించాలంటే మీరంతా ఎవళ్ళ ఇళ్ళకి వాళ్ళు వెళ్ళండి. అతన్ని హాస్పిటలుకు తీసికెళ్ళనీయండి!" అని ఎంత ప్రతిమాల వలసి వచ్చింది!

చిరంజీవి చావడు! చావగూడదు!! అతని ఉపన్యాసం విన్న కామాటీలు "నావికా సైన్యంలోవాళ్ళు మా బిడ్డలు! మా కన్న బిడ్డలు సరైన తిండి లేక మాడుతూంటే మేం చూడలేం" అన్నారు!

చిరంజీవి చనిపోతే—! "చిరంజీవి యెక్కడ"అని అడిగితే వాళ్ళకేమని సమాధానం చెప్పాలి!

నా బుర్ర తిరిగిపోతోంది! ముందున్న కొండలు కదుల్తున్నాయనిపించుతోంది. చౌపాతీలో సముద్రం గల్లంతు చేస్తోంది. ఎక్కడివా ఝుండాలు? మూడు రంగుల ఝుండా! పచ్చ ఝుండా! ఎర్ర ఝుండా! ఎక్కడివవి? చౌపాతీ నిండిపోతోంది. సముద్రం గల్లంతు వినపట్టంలేదు. లక్షల జనం. నల్లటి శరీరాలు. మలబారుకొండ అదిరిపోతోంది. వాళ్ళంతా అరుస్తున్నారు తెలుగులో అరుస్తున్నారు!

"చిరంజీవి జిందాబాద్!"

"జాతీయ నేవీ జిందాబాద్!"

క్యాంపులోకి పొట్లాలు వచ్చిపడుతున్నాయి, మాకు తిండి ఆగిపోయిందని ఎవరు చెప్పారు వీళ్ళకి! ప్రహారీగోడ మీదికి ప్రాకుతున్నారు జనం! తెల్లమిలిటరీ తుపాకులు కాలుస్తోంది. గోడలమీద మనుష్యులు ఏమాతున్నారు?......" మనుష్యులు గోడల్లోంచి పుట్టుకొస్తున్నారు. నా కుర్చీ ఊగుతోంది! యస్. బి. యే. నాచేయి పట్టుకు లాగుతున్నాడు. నేవీ టోపీలు పరుగెత్తుతున్నాయి; మావాళ్ళు పరుగెత్తుతున్నారు: గోడపై పుకి! తుపాకుల్తో!!

తెల్లమిలిటరీ పారిపోతోంది: చౌపాతీలోకి! చౌపాతీ దాటి సముద్రంలోకి!!

డాక్టరు కళ్ళజోడు తీస్తున్నాడు. కళ్లు తుడుచుకుంటున్నాడు. నావంక చూస్తూ "చిరంజీవి చనిపోలేదు. అట్లా చూస్తావేం! వీళ్ళంతా చిరంజీవులు కాదూ! ఆ జనమంతా చిరంజీవులే!!" అంటున్నాడు.

ఎస్. బి. యే. చేతుల్లోనుంచి తుపాకి లాక్కున్నాన్నేను.